

## ఉన్నత చదువులకు చేయూత

విద్యతోనే తలరాతలు మారుతాయని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం నిధులను జమ చేశారు. 8లో



## సమష్టి కృషితో నగరాభివృద్ధి

సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నట్లు మేయర్ హరి వెంకటకుమారి తెలిపారు. 8లో



## చీఫ్ ఆఫ్ డిఫెన్స్ పర్యటన

చీఫ్ ఆఫ్ డిఫెన్స్ జనరల్ అనిల్ చౌహాన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం తూర్పు నావికాదళాన్ని సందర్శించారు. 8లో

## న్యూస్‌రీల్

### ద్రోహులు వైఎస్సార్‌సీపీని వీడినా నష్టం లేదు

పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, పాడేరు: పదవుల కోసం పాకులాడే నేతలు, ద్రోహులు వైఎస్సార్‌సీపీని వీడినా నష్టం లేదని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన అల్లూరి జిల్లా హుకుంపేటలో మీడియాతో మాట్లాడారు. కొంతమంది చంద్రబాబు ట్రాప్‌లో పడ్డారని వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. పదవులు ఆశించే వారు వైఎస్సార్‌సీపీకి అవసరం లేదని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కార్యకర్తలు, అభిమానుల బలంతో వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందన్నారు.

### విశాఖ మీదుగా అమృత్ భారత్ రైలు



అత్యాధునిక సెకండ్ సీటింగ్ కోచ్

తాటిచెట్లపాలెం : అమృత్ భారత్ విశాఖ మీదుగా పరుగులు తీసేందుకు సిద్ధమైంది. రెండు అమృత్ భారత్ రైళ్లను శనివారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. వీటిలో ఒకటి మాల్డా టౌన్–ఎస్ఎంవీ బెంగళూరు–మాల్డా టౌన్ అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ విశాఖ మీదుగా రాకపోకలు సాగించనుంది. ఆదివారం మధ్యాహ్నం 11.03 గంటలకు శ్రీకాకుళం, 11.48 గంటలకు విజయనగరం, 1.45గంటలకు విశాఖ చేరుకోనుంది. అమృత్ భారత్ రెగ్యులర్ రైలు మాత్రం జనవరి 7వ తేదీ నుంచి నడవనుంది.

### పారిశుధ్య కార్మికులకు అండగా నిలవాలి

డాబాగార్డెన్స్: పారిశుధ్య కార్మికులకు అండగా నిలవాలని, ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల పథకాలు, రాయితీలు వారికి అందేలా చర్యలు చేపట్టాలని వివిధ విభాగాల అధికారులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్ర వారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి సఫాయి కర్మచారి సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు సంబంధించి వివిధ అంశాలపై సమీక్ష జరిపారు. ఆరోగ్య, ప్రమాద బీమా వర్తించేలా చర్యలు చేపట్టాలని, అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు వారికి తోడుగా నిలవాల ని సూచించారు.

### రేపు పశుసంవర్ధక సహాయకుల పోస్టుకు పరీక్ష

మహారాణిపేట : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు సంవర్ధక సహాయకుల పోస్టుల పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశు సంవర్ధక శాఖ, పోలీస్, విద్యుత్, వైద్య, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. జిల్లా నుంచి 1708 మంది, ఇతర జిల్లాల నుంచి 1641 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రామకృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, చీఫ్ సూపరింటెండెంట్లు, జీవీఎంసీ, పోలీస్, మెడికల్, ఈపీడీసీఎల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### పదోన్నతిపై ఇద్దరు ఏసీపీలకు బదిలీ

విశాఖ సిటీ: విశాఖలో ఇద్దరు ఏసీపీలకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ద్వారకా ఏసీపీగా ఉన్న ఆర్‌వీఎస్ఎన్ మూర్తి పదోన్నతిపై ఖాళీగా ఉన్న ఇంటెలిజెన్స్ ఏఎస్పీగా నియమితులయ్యారు. అలాగే నార్త్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.శివరామిరెడ్డి కూడా పదోన్నతిపై తిరుమల లా అండ్ ఆర్డర్ ఏఎస్పీగా బదిలీ అయ్యారు.

### మరో ముగ్గురికి కరోనా

మహారాణిపేట: విశాఖలో శుక్రవారం మరో ముగ్గురికి కరోనా సోకింది. 24 గంటల్లో 120 మందికి పరీక్షలు చేయగా, వీరిలో ముగ్గురికి కరోనా నిర్ధారణ జరిగింది. 9 మంది హోమ్ ఐసోలేషన్‌లోను, ఇద్దరు కేజీహెచ్‌లోను చికిత్స పొందుతుండగా..ఆరుగురు డిశ్చార్జ్ అయ్యారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

# నిఘా పటిష్టం.. నేరాలు తగ్గుముఖం

- విశాఖ సురక్షిత నగరం
- సత్ఫలితాలిచ్చిన దిశ యాప్
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో తగ్గిన రోడ్డు ప్రమాదాలు
- ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్‌లో నిరంతరం కే9 జాగిలాలతో తనిఖీలు
- మీడియాతో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్



మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

**విశాఖ సిటీ: విశాఖ నగరం సురక్షిత నివాస ప్రదేశంగా మార్చడానికి పోలీస్ శాఖ చేపట్టిన సమర్థవంతమైన చర్యలతో నేరాలు 27.92 శాతం మేర తగ్గుముఖం పట్టాయని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పేర్కొన్నారు. 2024లో మరింత సమర్థవం**తమైన పోలీసింగ్‌తో క్రైమ్ రేట్ నియంత్రణకు సాంకేతికతను, అందుబాటులో ఉన్న మానవ వనరులను అభివృద్ధి చేసుకుంటూ ప్రశాంత విశాఖే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో 2023లో పోలీసులు సాధించిన ప్రగతి, ఛేదించిన కేసుల వివరాలను సీపీ వెల్లడించారు. 2022లో 4,494 కేసులు నమోదు కాగా.. 2023లో 3,513 కేసులు నమోదైనట్లు చెప్పారు. సైబర్ నేరాలు మాత్రం గతంలో కంటే పెరిగాయని, ఈ కేసుల దర్యాప్తునకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి విశాఖ మీదుగా మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కే9 డాగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ ఏడాది కాలంలో నేరాల తీరును విశ్లేషిస్తూ సీపీ చెప్పిన వివరాల ప్రకారం..

**క్షణికావేశంతోనే హత్యలు**

నగరంలో 2022లో 40 మంది హత్యకు గురవగా.. ఈ ఏడాది 27 హత్యలు జరిగాయి. మద్యం మత్తు, వివాహేతర సంబంధాలు, క్షణికావేశమే హత్యలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. క్షణికావేశంలో 3, అక్రమ సంబంధాలతో 6, కుటుంబ కలహాలతో 4, పాత కక్షలతో 6, మద్యం మత్తు, ఆర్థిక వివాదాలు, ప్రేమ వ్యవహారాలు, చిన్న తగాదాలు, ఇతరత్రా కారణాలతో మిగిలిన హత్యలు జరిగాయి.

**తగ్గిన దొంగతనం కేసులు**

2022లో 894 చోరీ కేసులు నమోదు కాగా.. 2023లో 666 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జరిగిన దొంగతనాల్లో మొత్తం రూ.5.16 కోట్లు చోరీ జరగగా.. అందులో రూ.3.12 కోట్లు విలువైన ఆస్తులను రికవరీ చేశారు. 366 కేసుల్లో 712 మంది నిందితులను అరెస్టు చేయగా.. వారిలో 152 మంది శిక్ష ఖరారైంది. ఇందులో 63 కేసులను సీసీ కెమెరాలు ద్వారా ఛేదించారు. 31 కేసులలో ఫింగర్ ప్రింట్స్, 12 కేసులలో సెల్‌ఫోన్ డేటా ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. 16 మందిపై హిస్టరీ షీట్స్ తెరిచారు. దిశతో మహిళలకు భద్రత లభిస్తోంది. 2022లో 1,282 కేసులు నమోదవగా, 2023లో 884 (45.02 శాతం తగ్గుదల) కేసులు వచ్చాయి. అలాగే పిల్లలపై నేరాల శాతం 39.36 శాతం తగ్గుదల నమోదైంది.

**సత్ఫలితాలిచ్చిన ట్రాఫిక్ క్రమబద్ధీకరణ**

రోడ్డు ప్రమాదాలను విశ్లేషించి చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయి. 2022లో 1,353 రోడ్డు ప్రమాదాలు జరగగా.. 2023లో 1,158 ప్రమాదాలు సంభవించాయి. గతేడాది 358 మంది ప్రాణాలు కోల్పోగా.. ఈ ఏడాది 317 మంది మరణించారు.

**సైబర్ స్టేషన్ సాంకేతికత**

ఆన్‌లైన్ షాపింగ్, స్మార్ట్‌ఫోన్ల వినియోగం విపరీతంగా పెరగడంతో సైబర్ కేసులు రెట్టింపు స్థాయిలో పెరుగుతున్నాయి. 2022లో 610 సైబర్ నేరాల్లో బాధితులు రూ.16.33 కోట్లు మేర నష్టపోయారు. 2022లో 410 (ఒకే రకమైన కేసులు కలపడంతో) కేసుల్లో రూ.31.79 కోట్లను సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు. ఇందులో కేవలం రూ.3.27 కోట్లు బ్యాంకుల్లో ఫ్రీజ్ చేయగా.. రూ.20.91 లక్షలు మాత్రమే బాధితులకు అందజేశారు. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి సైబర్ నేరాలకు పాల్పడడంతో వారిని పట్టుకోవడం, బాధితులు కోల్పోయిన నగదును రికవరీ చేయడం కష్టంగా మారుతోంది. దీంతో ఈ కేసులను మరింత సమర్థవంతంగా దర్యాప్తు చేసేందుకు అవసరమైన సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

**ప్రజల సహకారంతో..**

ఒకవైపు నేరాల నియంత్రణతో పాటు ప్రజా భద్రతకు కూడా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. విశ్వనగరంగా ఎదుగుతున్న విశాఖలో ప్రముఖుల తాకిడి విపరీతంగా పెరిగిందని, ప్రధాన సమావేశాలు, సదస్సులకు కేంద్రంగా మారిందని, అంతర్జాతీయ మ్యాచ్‌లు, ఆలయా ఉత్సవాలు, గిరి ప్రదక్షిణలు, ఇతర ప్రధాన కార్యక్రమాలకు ఒకవైపు బందోబస్తుతో పాటు మరోవైపు శాంతిభద్రతలు, ట్రాఫిక్, క్రైమ్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారించి విశాఖ పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో డీసీపీలు కె.శ్రీనివాసరావు, కె.ఆనందరెడ్డి, వెంకటరత్నం, ఏడీసీపీ(ఎస్‌బీ) నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

| 2022–2023లో నమోదైన కేసుల వివరాలు | |
|---|---|
| 2022లో | 4,494 |
| 2023లో | 3,513 |
| 2022లో హత్యలు | 40 |
| 2023లో హత్యలు | 27 |
| 2022లో చోరీలు | 894 |
| 2023లో | 666 |

### కాంప్లెక్స్, రైల్వేస్టేషన్లలో కే9 డాగ్ స్క్వాడ్

విశాఖలో మాదవ ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేసి, సరఫరా చేసే వారితో పాటు అసలు సూత్రధారులు, వినియోగదారులపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. గతేడాది 255 డ్రగ్స్ కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 224 కేసులు నమోదు చేశారు. గతేడాదిలో 636 మందిని అరెస్టు చేసి వారి నుంచి 5,866.84 కేజీల గంజాయి, 3803 ఇంజక్షన్లు, 8 వేల ట్యాబ్లెట్లు, 134.5 ఎల్ఎస్‌డీ బ్లాట్స్, 1.427 ఎండీఎంఏ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది 224 కేసుల్లో 660 మందిని అరెస్టు చేశారు. జిల్లా పరిధిలో ఎక్కడా గంజాయి సాగుకు అవకాశం లేనప్పటికీ పొరుగు రాష్ట్రాల నుంచి విశాఖకు మాదక ద్రవ్యాల అక్రమ రవాణారను నిరోధించేందుకు రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, హోటళ్లు, లాడ్జీలను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కే9 డాగ్ స్క్వాడ్‌లతో నిఘా పెడుతున్నారు. మరో 6 కే9 జాగిలాలను జిల్లా కలెక్టర్ మల్లికార్జున పోలీసులకు స్పాన్సర్ చేస్తానని హామీ ఇచ్చారు. వాటితో పాటు నిరంతరం ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్‌లో డ్రగ్స్‌ను గుర్తించేందుకు వినియోగించనున్నారు.

### ప్రజల భద్రతకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్

**విశాఖ ప్ర**జల భద్రతకు నగర పోలీస్ **శాఖ పటిష్ట చ**ర్యలకు శ్రీకారం చుట్టింది. **ప్రమాద సమయా**ల్లో తక్షణ సాయం.. నేరాల **నియంత్రణకు స**రికొత్త సాంకేతికతను అం**దుబాటులోకి తీసు**కురానుంది. ఇప్పటి వరకు ఎక్కడా లేని విధంగా ప్రమోటింగ్ పార్టనర్‌షిప్ ఇన్ పోలీసింగ్(పీపీఐపీ) పేరుతో సరికొత్త కార్యక్రమానికి నాంది పలుకుతోంది. ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు చెందిన వాహనాలలో జీపీఎస్ పరికరాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కానిస్టేబుల్ నుంచి కమిషనర్ వరకు అందరూ ఆ జీపీఎస్ గ్రిడ్‌లో ఉండే విధంగా అప్లికేషన్‌ను రూపొందించింది. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు తక్షణమే సాయం అందించాలన్న లక్ష్యంతో ఈ సరికొత్త జీపీఎస్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. వీటిని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలైన ఆర్టీసీ, ఓలా, ఊబర్, ర్యాపిడో, ట్యాక్సీ, ట్రాన్స్‌పోర్ట్, అన్ని పోలీసు వాహనాల్లో అమర్చాలని భావిస్తున్నారు. ఇందుకోసం పోలీస్ అధికారులు త్వరలోనే ఆయా సంస్థలతో సమావేశం నిర్వహించనున్నారు. ఒకవైపు బాధితులకు తక్షణ సాయం అందడంతో పాటు నేరగాళ్లను పట్టుకొనేందుకు కూడా ఈ విధానం దోహదపడుతుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ భావిస్తున్నారు.

# యాదవులకు సముచిత స్థానం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మేయర్ హరి వెంకటకుమారి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మేయర్ హరి వెంకట కుమారి

కొమ్మాది : వైఎస్సార్‌సీపీ హయాంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి యాదవులకు ఉన్నత పదవులు కల్పించారని పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 2014లో తూర్పు నియోజకవర్గం నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారన్నారు. అయితే ఆయన ఓడిపోయారని, తరువాత జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించారన్నారు. ఎమ్మెల్సీ పదవి కూడా ఇచ్చారన్నారు. అయినప్పటికీ నేడు పార్టీని వీడి అనేక దుష్ప్రచారాలు చేస్తున్నారని, ఇదెంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ జిల్లాలో 14 మంది యాదవులకు కార్పొరేటర్లగా టికెట్లు ఇచ్చారని, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ, మేయర్ ఇలా యాదవ వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ మరెక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. పలు సమీకరణాల నేపథ్యంలో టిక్కెట్ల కేటాయింపు విషయంలో నిర్ణయాలు మారుతాయన్నారు. పచ్చ మీడియాలో మేయర్‌ను మారుస్తారంటూ వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని, ప్రజలు ఇది గమనించాలన్నారు.

# జిల్లాలో 865 ఫారాలు మాత్రమే పెండింగ్

కలెక్టర్ మల్లికార్జున వెల్లడి

సాక్షి, విశాఖపట్నం : జిల్లాలో ఎలాంటి పెండింగ్ ఫారాలు లేకుండా తగిన చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున వివరించారు. ఓటర్ల జాబితాపై పెండింగ్ దరఖాస్తులు, పోలింగ్ కేంద్రాలలో వసతులు తదితర సమాచారంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 865 మాత్రమే ఫారం 6,7,8 పెండింగ్ ఉన్నాయని, వాటిని వారంలోగా పరిశీలించి పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ఏఈఆర్‌ఓల నుంచి సమాచారం పొంది తగిన ఏర్పాట్లు చేయిస్తామన్నారు. ఎన్నికలకు సరిపడా స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించామని వివరించారు. పీడబ్ల్యూడీ ఓటర్లకు సంబంధించిన వివరాల్ని ఈఆర్వోలతో మరోసారి పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైన ఎన్నికల పరిశీలకులు, పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బంది విషయమై చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌రావు, ఈఆర్వోలు, అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం



స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో 55 అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థాయీ సంఘం పొందుపరిచిన 52 అంశాలతో పాటు 3 టేబుల్ అజెండాలు చర్చకు రాగా, సభ్యులు ఆమోదించారని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి రూ.256.60 కోట్ల అభివృద్ధి పనులు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి పలు కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాల కోసం సుమారు రూ.142.72 కోట్లు, రెవెన్యూ విభాగానికి సంబంధించి లీజుల పొడగింపు తదితర అంశాలతో కలిసి మొత్తం 55 అంశాలను సభ్యులు ఆమోదించారన్నారు. సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, కార్యదర్శి నల్లనయ్య, డీసీ(రెవెన్యూ) ఫణిరామ్, జోనల్ కమిషనర్ జీవీ కృష్ణ, కార్యనిర్వాహక ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీలో అసంతృప్తి జ్వాలలు

- జెండా మోస్తున్నా..సహకారం లేదు
- ఉత్తర నియోజకవర్గ నేతల ఆవేదన
- గెలిచిన తరువాత ముఖం చాటేసిన గంటా
- 2024 ఎన్నికలపై కార్యాచరణకు సిద్ధం



26వ వార్డు టీడీపీ కార్యాలయంలో సమావేశమైన టీడీపీ వార్డు నాయకులు, వార్డు అధ్యక్షులు


సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలోని టీడీపీ నేతల్లో అసంతృప్తి జ్వాలలు బయటపడ్డాయి. గత 2014,2019 ఎన్నికల్లో అధిష్టానం ఆదేశాలకు తలొగ్గి ఎవరికి బీఫారం ఇస్తే వారిని గెలిపించిన తెలుగు తమ్ముళ్లు..ఇప్పుడు తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. రానున్న 2024 ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గానికి శాశ్వత నాయకత్వం కల్పించేలా స్థానిక నేతను అభ్యర్థిగా ప్రకటించాలని, సమర్థవంతమైన నియోజకవర్గ ఇంచార్జిని నియమించాలని 26వ వార్డు అక్కయ్యపాలెంలోని వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిషోర్ కుమార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో నాయకులు ఉమ్మడిగా తీర్మానించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన పెనుమత్స విష్ణుకుమార్‌రాజును సమష్టిగా శ్రమించి గెలిపించామని, గెలిచిన తర్వాత టీడీపీ నాయకులకు సరైన గుర్తింపు, విలువ ఇవ్వకపోగా..ఎటువంటి సహకారం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు గంటా శ్రీనివాసరావుకు పార్టీ టికెట్ ఇస్తే ఆయనను గెలిపించుకున్నామన్నారు. గెలిచిన నాటి నుంచి గంటా ప్రజలకు, పార్టీ నేతలకు అందుబాటులో లేకుండాపోయారన్నారు. చివరకు ఉత్తర నియోజకవర్గంలో టీడీపీ కార్యాలయం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు నాయకులకు, కార్యకర్తలుగాని ఏదైనా సమస్య వచ్చి పిలిస్తే పలికే నాయకుడు కరువయ్యాడన్నారు. గంటా గెలిచిన తర్వాత నాలుగున్నరేళ్లలో ఎటువంటి సాయం, సహకారం లభించలేదన్నారు. గంటాను కలవాలంటే ఎన్నో ఆంక్షలున్నాయని, తమ సమస్యలు చెప్పుకుందామన్నా అవకాశం లేకుండా పోయిందన్నారు. ఏ సమావేశమైనా తూర్పు నియోజకవర్గంలోని ఎంవీపీ కాలనీలోని గంటా ఇంటికి వెళ్లాల్సిందేనన్నారు. 2024 ఎన్నికల్లో అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ఉత్తర నియోజకవర్గంలో శాశ్వత నాయకత్వం రావాలని, టీడీపీ క్యాడర్‌కు అండగా నిలిచే సమర్థవంతమైన ఇన్‌చార్జిని నియమించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో 17 వార్డుల్లో దాదాపు 15 వార్డులకు చెందిన టీడీపీ క్యాడర్ మొత్తం అసంతృప్తిగా ఉందని, తమ ఇబ్బందులు తొలగించే నాయకత్వం కావాలని తీర్మానించారు. భవిష్యత్ కార్యాచరణకై జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్లమెంట్ ఇంచార్జి మతుకుమిల్లి భరత్‌కు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడ్ని కలిసి తమ సమస్యలు విన్నవించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఉత్తర నియోజకవర్గ టీడీపీ నాయకులు, వార్డు అధ్యక్షులు ఈతలపాక సుజాత, అక్కిరెడ్డి జగదీష్, తాతినేని శ్రీనివాసరావు, కొయిలాడ వెంకటేష్, మురళి, భరణికాన రాజు, పైడికొండ, బొడ్డేటి మోహన్, జాన్, కోట్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తీవ్ర విషాదం

- ఆర్థిక ఇబ్బందులు భరించలేక వ్యాపారి కుటుంబం ఆత్మహత్య
- సైనైడ్ కలిపిన బిర్యానీ తిని ప్రాణాలు విడిచిన దంపతులు, పిల్లలు
- నలుగురు మృతి.. ప్రాణాలతో బయట పడిన చిన్న కుమార్తె



శివరామకృష్ణ కుటుంబం (ఫైల్ )



విగత జీవులుగా శివరామకృష్ణ కుటుంబం

సాక్షి, అనకాపల్లి/అనకాపల్లి: పట్టణంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధ తాళలేక నగల దుకాణ వ్యాపారి.. కుటుంబ సభ్యులతో సహా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బిర్యానీలో సైనైడ్ కలిపి భార్య, ముగ్గురు పిల్లలతో తినిపించి బలవన్మరణానికి పాల్పడిన దుర్ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వీరిలో నలుగురు మృతి చెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, పోలీసులు చెప్పిన వివరాలు.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జ్యూయలరీ వ్యాపారి కొడవలి శివరామకృష్ణ తన కుటుంబంతో ఏడాదిన్నర క్రితం అనకాపల్లి వచ్చాడు. పెరుగుబజారు సమీపంలో బంగారు నగల దుకాణం ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో స్వస్థలాన్ని వీడిన రామకృష్ణ (42) స్థానిక ఉడ్ పేటలో ఫైర్ స్టేషన్ పక్కన లక్ష్మీ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో భార్య మాధవి దేవి (35), కుమార్తెలు వైష్ణవి (15), జాహ్నవి (12), కుసుమ ప్రియ (9)లతో కలిసి నివాసముంటున్నాడు. తన పిల్లలను స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్లో చదివిస్తున్నాడు. పిల్లలు తొమ్మిది, ఏడు, మూడు తరగతులు చదువుతున్నారు. ఏడాదిన్నర నుంచి అనకాపల్లి టౌన్‌లోనే ఉన్నా వ్యాపార రీత్యాగానీ, పని నిమిత్తం గానీ ఎవరితో వివాదం పెట్టుకున్న సందర్భాలు లేవు. అయితే ఆ కుటుంబం చుట్టుపక్కల వారితో కలివిడిగా ఉండేవారు కాదని, ముభావంగా అంటీముట్టనట్టు ఒంటరిగా ఉండేవారని స్థానికులు తెలిపారు.

**బిర్యానీలో సైనైడ్..**

రామకృష్ణ గురువారం రాత్రి 9 గంటలకు దుకాణం నుంచి ఇంటికి వచ్చాడు. సైనైడ్ కలిపిన బిర్యానీ తీసుకొచ్చాడు. ఆ విషయం భార్య పిల్లలకు తెలీదు. కుటుంబమంతా బిర్యానీ తిన్నారు. అంతలో చిన్న కూతురు కుసుమ వాంతి చేసుకుంది. కొద్ది క్షణాల్లోనే మిగతావారంతా నేలకొరిగారు. ఈ విషయం గమనించిన కుసుమ పక్కింటికి వెళ్లి 'అమ్మ, నాన్న నిద్రపోయి లేవలేదు' అని ఏడుస్తూ చెప్పింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వాంతులు చేసుకున్న చిన్నారిని హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అనంతరం కేజీహెచ్‌కు తరలించారు.

**అప్పుల బాధ తాళ లేకనే ఆత్మహత్య!**

డీఎస్పీ వి.సుబ్బరాజు, సీఐ దాడి మోహన్‌రావు రాత్రి ఒంటి గంటకు సంఘటన స్థలానికి చేరుకుని తెనాలిలో నివసిస్తున్న శివరామకృష్ణ అన్నయ్య వెంకటేశ్వరరావుకు సమాచారం అందించారు. ఆయన శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు అనకాపల్లికి చేరుకున్న అనంతరం మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు.

రామకృష్ణ అప్పులు చేసి.. ఎవరికీ తెలియకుండా అనకాపల్లి టౌన్‌లో నివసిస్తున్నట్టు అతని సోదరుడు వెంకటేశ్వరరావు చెప్పిన వివరాల ప్రకారం తెలుస్తోంది. మూడు సంవత్సరాలుగా కుటుంబ సభ్యులతో సఖ్యత లేదని సమాచారం. మృతదేహాలను చూసేందుకు ఒక సోదరుడు మినహా కుటుంబ సభ్యులు ఎవరూ రాలేదు. సంఘటన స్థలంలో ఆత్మహత్యకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించలేదని డీఎస్పీ వి.సుబ్బరాజు చెప్పారు. క్లూస్‌టీమ్ ఇంట్లో అన్ని గదులను క్షణంగా పరిశీలించిందన్నారు. బిర్యానీ తిని అక్కడిక్కడే నాలుగురు మృతి చెందగా, కుసుమప్రియ అపాయం తప్పించుకుందని, ప్రస్తుతం కేజీహెచ్‌లో కోలుకుంటోందన్నారు. శివరామకృష్ణ అన్నయ్య వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దాడి మోహనరావు చెప్పారు.

## చీఫ్ ఆఫ్ డిఫెన్స్ జనరల్ రెండు రోజుల పర్యటన

సింధియా: చీఫ్ ఆఫ్ డిఫెన్స్ జనరల్ అనిల్ చౌహాన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం తూర్పు నావికాదళాన్ని సందర్శించారు. తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఐఎన్ఎస్ డేగా వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. తీర ప్రాంత రక్షణలో తూర్పు నావికాదళ పోషిస్తున్న పాత్రను సమగ్రంగా ఆయనకు వివరించారు.



# ఉన్నత చదువులకు చేయూత

- జగనన్న విద్యా దీవెన నాల్గో విడతలో 35,282 మందికి రూ.26.75 కోట్ల లబ్ధి
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి

**విశాఖ విద్య:** విద్యతోనే తలరాతలు మారుతాయని కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున అన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం కింద 2022–23 విద్యా సంవత్సరం నాల్గో త్రైమాసికానికి సంబంధించి 35,282 మంది విద్యార్థులకు రూ.26.75 కోట్లను జాయింట్ ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. నాల్గో విడత ఫీజు రీయింబర్స్‌మెంట్(జగనన్న విద్యా దీవెన) పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భీమవరంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తిలకించేలా కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో తగిన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, రాష్ట్ర రెల్లి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వి.మధుసూదనరావు, రాష్ట్ర యాత, నగరాల సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్లు పిల్లి సుజాత, పిల్లా సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే 35,282 మంది విద్యార్థులకు రూ.26,75,26,495 నిధులు జమచేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో 29,495 మంది బీసీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు గానూ రూ.22,43,41,116, 4,486 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.3,30,39,938, 146 మంది గిరిజన విద్యార్థులకు రూ.10,74,978, క్రిస్టియన్, ముస్లిం, మైనారిటీలకు చెందిన 1,155 మంది విద్యార్థులకు రూ.90,70,463 మంజూరైనట్లు చెప్పారు. 2022–23 విద్యా సంవత్సరంలో నాలుగు విడతలు కలిపి మొత్తం రూ.129 కోట్ల మేర విద్యార్థులకు లబ్ధి చేకూరుతున్నట్లు వివరించారు. అనంతరం నిధుల పంపిణీ నమూనా చెక్కును తల్లులు, విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కె.రామారావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.శ్రీదేవి, పలు కళాశాలల విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ సాయంతో మా కష్టాలు తీరాయి



మా నాన్న వెంకటరావు రోజువారీ కూలీ. నేను ప్రభుత్వ పాత ఐటీఐలో ఎలక్ట్రానిక్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. మా కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేక మధ్యలోనే చదువు ఆపేద్దామని అనుకున్నా. అదే సమయంలో జగనన్న విద్యాదీవెన పథకం భరోసా ఇవ్వడంతో కొనసాగించాను. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో నాలాంటి నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువం.

– గనగల్ల సంధ్య, అప్పుఘర్

### దీవెన మాకు ఎంతో ఉపయోగం



మాది శ్రీకాకుళం జిల్లా పలాస దగ్గర మహాదేవి పురం. నాన్న ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. అమ్మ ఇంటి వద్దనే ఉంటుంది. 10వ తరగతిలో 588 మార్కులు వచ్చాయి. అమ్మా నాన్నకు ఆర్థికంగా తోడ్పాటుగా నిలవాలని నర్సింగ్ చేస్తున్నాను. ఫీజు మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుండటంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం లేదు. దర్జాగా చదువుకుంటున్నాను.

– మేరీ జాస్మిన్, శ్రీకాకుళం

# సమష్టి కృషితో నగరాభివృద్ధి

- 2024లో మరింత ఉత్సాహంగా పనిచేస్తాం
- నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
- మేయర్ గొలగాని హరివెంకటకుమారి

**డాబాగార్డెన్స్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. 2023లో సాధించిన ప్రగతిని వివరించిన ఆమె.. లోపాలు సవరించుకుని 2024లో నూతనోత్సాహంతో విశాఖ నగర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. 2024కి ఆహ్వానం పలుకుతూ.. నగర ప్రజలకు ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె. సతీష్, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావుకు తినిపించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 97 వార్డుల కార్పొరేటర్లతో కలిసి విశాఖ నగరాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ.. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు జీవీఎంసీ నిత్యం కృషి చేస్తోందని.. ఇందులో భాగంగా ఎకో వైజాగ్ పేరిట బృహత్తర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆధ్వర్యంలో జీవీఎంసీ, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్రతి నెలా మొదటి ఆదివారం తీర స్వచ్ఛత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో వాయు, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు.. ప్రతి సోమవారం జీవీఎంసీ యంత్రాంగం ప్రజా రవాణాను వినియోగిస్తున్నట్లు చెప్పారు.

**రూ.205కోట్లతో అభివృద్ధి పనులు**

జీవీఎంసీ నగరాభివృద్ధిలో భాగంగా 2023–24 ఏడాదికి రూ.205 కోట్ల 5 లక్షల అంచనాలతో 967 పనులు చేపట్టగా, రూ.70 కోట్ల 4 లక్షలతో 322 పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. వార్డుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 98 వార్డులకు గానూ రూ.148 కోట్ల 11 లక్షల అంచనాతో 938 పనులు చేపట్టగా.. 577 పనులు పూర్తయ్యాయని వివరించారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నాడు–నేడు పాఠశాల అభివృద్ధి కార్యక్రమంలో తొలి దశలో 59 పాఠశాలలను రూ.20 కోట్ల 77 లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. రెండో దశలో 87 పాఠశాలల అభివృద్ధికి రూ.34 కోట్ల 79 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. 32 కోట్ల 97 లక్షలతో 42 వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. 40 ఆరోగ్య కేంద్రాల పనులు పూర్తి చేసినట్లు వివరించారు. రూ.2కోట్లతో 24 ఆరోగ్య కేంద్రాలు, రూ.3 కోట్ల 41 లక్షలతో 30 ఆరోగ్య కేంద్రాల ప్రహరీ పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

**పారిశుధ్య కార్మికులు ఆలోచించాలి**

జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టడంతో నగరంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోందని మీడియా అడిగిన ప్రశ్నకు కమిషనర్ సాయికాంత్‌వర్మ స్పందించారు. పారిశుధ్య సమస్య ప్రజారోగ్యానికి సంబంధించినదని, పారిశుధ్య కార్మికులు విజ్ఞతతో ఆలోచించాలని సూచించారు. సమ్మె చేస్తున్న దృష్ట్యా పొరుగు సేవలు వినియోగించుకుంటే.. సమ్మెలో ఉన్న కార్మికులు ఆటంకం కలిగిస్తున్నారని చెప్పారు. ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉందని.. త్వరలోనే వారి సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. వీధుల్లో కుక్కలు, పందుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# జాతీయ బీచ్ రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

**బీచ్‌రోడ్డు:** విశాఖ వేదికగా జాతీయ, అంతర్జాతీయ పోటీలు నిర్వహించేందుకు అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం ఎదురుగా శుక్రవారం నేషనల్ బీచ్ గ్రాప్లింగ్ (రెజ్లింగ్) చాంపియన్‌షిప్–2023 పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు ఆటలు ఆడేందుకు ప్రత్యేకంగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. 18 రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు విశాఖ అందాలను తిలకించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మొల్లి అప్పారావు, పల్లి దుర్గారావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఈ పోటీలకు 18 రాష్ట్రాల నుంచి 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఇండియన్ బీచ్ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దినేష్ కపూర్ తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వసతులు కల్పించినట్లు చెప్పారు.



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి

**తొలిరోజు 40 మ్యాచ్‌లు..**

తొలి రోజు నాలుగు విభాగాల్లో కలిపి 40 మ్యాచ్‌లు నిర్వహించారు. క్రీడాకారులు పోటాపోటీగా తమ సత్తాను ప్రదర్శించారు. శనివారం క్వార్టర్, సెమీ ఫైనల్స్, ఆదివారం తుది పోటీలు నిర్వహిస్తామని దినేష్ కపూర్ తెలిపారు.

# రోడ్డు రోలర్ బోల్తా

- డ్రైవర్, కూలీ మృతి
- బీచ్‌రోడ్డులో ఘటన

**ఆరిలోవ:** బీచ్‌రోడ్డులోని జూ పార్కు, సాగర్ గేట్ వద్ద శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎన్నడూ లేని విధంగా రోడ్డు రోలర్ బోల్తా పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఆరిలోవ ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలివీ.. పెదజాలరిపేటలో రోడ్డు పని పూర్తయిన తర్వాత రుషికొండ ప్రాంతంలో చేపట్టే పనికి డ్రైవర్ బత్తుల నర్సింగరావు రోడ్డు రోలర్‌ను తీసుకెళ్తున్నాడు. ఆయనది గాజువాక ప్రాంతం శ్రీనగర్ దరి సాయినగర్. అదే రోలర్‌పై కూలీ, తాటిచెట్లపాలేనికి చెందిన ఎం.రమణమ్మ(55) రుషికొండ వెళుతోంది. రోలర్ జూ పార్కు సాగర్ గేట్ వద్దకు వచ్చేసరికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. అక్కడ రోడ్డు పల్లం కావడంతో అదుపు తప్పిన రోలర్ డివైడర్ పైకి దూసుకుపోయి.. పక్క లైన్‌లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రోలర్ చక్రాల కింద పడిపోయాడు. రోలర్‌పై కూర్చొన్న రమణమ్మ పక్కకు తుళ్లిపోవడంతో.. ఆమె కాలుపై ఓ చక్రం ఎక్కేసింది. దీంతో ఆమె పాదం శరీరం నుంచి విడిపోయి పక్కన పడింది. నర్సింగరావు శరీరం మొత్తం గుర్తుపట్టలేని విధంగా నుజ్జునుజ్జు అయిపోయింది. ఈ ప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. సీఐ ద్వారా సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు రోడ్డు రోలర్‌ను అతి కష్టం మీద పక్కకు తొలగించి.. నర్సింగరావు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. కాలు పోగొట్టుకున్న రమణమ్మను చికిత్స కోసం కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ సాయంత్రం ప్రాణాలు విడిచింది. నర్సింగరావుకు భార్య, ఇద్దరు పిల్లలు, రమణమ్మకు ఓ కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.



సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు

# నకిలీ ఐపీఎస్‌కు మూడేళ్ల జైలు

**బీచ్‌రోడ్డు:** ఐపీఎస్ అధికారిని అంటూ బెదిరించి, హోటళ్లలో సేవలు పొందిన వ్యక్తికి నాలుగో ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు మూడేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధించింది. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రామారావు తెలిపిన వివరాలివీ.. 2015లో పి.రమేష్‌నాయుడు అనే వ్యక్తి ఐపీఎస్ అధికారిని అంటూ కారుకు ఎరుపు రంగులైట్ పెట్టుకుని.. స్టార్ హోటళ్లలో సిబ్బందిని బెదిరించి వివిధ సేవలు పొందాడు. అతనిపై అనుమానం వచ్చి ఓ హోటల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆయనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి రాజేష్‌కుమార్ రమేష్‌కు మూడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించారని సీఐ తెలిపారు.

## అగ్రి బిజినెస్‌లో డిజిటల్ మార్కెటింగ్‌ది కీలక పాత్ర

- పల్సస్ సీఈవో శ్రీనుబాబు



నిర్వాహకులతో పల్సస్ సీఈవో శ్రీనుబాబు

**మధురవాడ:** ప్రపంచీకరణ ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలకు ద్వారాలు తెరిచిపెట్టిందని.. ఈ అద్భుత సమయంలో ప్రతీ రైతుబిడ్డ పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు చక్కని అవకాశం లభించిందని పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు అన్నారు. పీఎంపాలెంలోని శ్రీనివాస ఫార్మసీ అండ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి వెన్నెముక అయిన రైతులు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి మాత్రమే కాకుండా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ప్రయాణం ప్రారంభించడానికి డిజిటల్ సాధనాలను ఉపయోగించుకోవచ్చునన్నారు. అగ్రి బిజినెస్ అభివృద్ధి చెందుతున్న కీలక దశలో మనం ఉన్నామన్నారు. వ్యవసాయంలో డిజిటల్ మార్కెటింగ్ ఆవశ్యకత ఎంతో ఉందని, అందులో ఉన్న అపార అవకాశాలు, మార్గాలను ఆయన వివరించారు. అనకాపల్లిలో ఓ రైతు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులతో అనుసంధానం చేశారన్నారు. సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, కంటెంట్ క్రియేషన్, ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై దృష్టిసారించాలన్నారు.

## బ్యాంక్‌ను మోసగించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష

**విశాఖ లీగల్:** బ్యాంకును మోసం చేసి లబ్ధి పొందిన ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలో సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి సి.ఎస్.మూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.6 వేలు జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. వివరాలివీ.. నిందితుడు ఎం.సుధాకరరావు విశాఖలోని మిసర్స్ మాస్టర్ స్టీల్ ట్యూబ్ అధినేత. 2020 జూన్‌లో నిందితుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులను సంప్రదించాడు. విలువ లేని ఆస్తులను బ్యాంకుకి చూపించి దఫదఫాలుగా రూ.60,49,227 రుణం తీసుకున్నాడు. నకిలీ వే బిల్లులు, తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి లేని ఆస్తిని ఉన్నట్టుగా రికార్డుల్లో చూపించాడు. దీనిపై అనుమానంతో బ్యాంక్ పారిశ్రామిక విభాగం దర్యాప్తు చేయగా.. మొత్తం వ్యవహారం బయటపడింది. దీంతో సీబీఐ అధికారులు రంగంలోకి దిగి కేసును దర్యాప్తు చేశారు. సుధాకరరావు పై కేసు నమోదు చేశారు. నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి 420, 120 బీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.



## సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

విశాఖపట్నం మెయిన్ బ్రాంచ్, 50-81-25, జె.జె.సెంటర్, మొదటి అంతస్తు, సీతమ్మపేట, విశాఖపట్నం-530016. ఫోన్ : 0891-2563595

### ఇ-వేలం అమ్మకం కొరకు ప్రకటన

చరాస్తి యొక్క అమ్మకం మరియు అమ్మకం ప్రకటన (ప్లాంట్ & మిషనరీ)

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఋణగ్రహీతలు / హామీదారులు చెల్లించవలసిన దిగువ తెలిపిన బకాయి మొత్తము వసూలు కొరకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే నిర్మాణాత్మకంగా / భౌతికంగా స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా అధీనంలో నున్న దిగువ వివరించిన చరాస్తి "ఎక్కడ ఎలా వున్నది అలానే" "ఏది ఎలా ఉంటే అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై తేది.17.01.2024 న ఆన్లైన్ వెబ్ పోర్టల్ https://mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp నందు విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలముగా సూచించటమైనది. రిజర్వు ధర, ధరావత్తు మరియు చరాస్తి వివరములు దిగువ తెలుపబడినవి. మిగిలిన వివరముల కొరకు మరియు అమ్మకం నిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్ సైట్ www.centralbankofindia.co.in లోని లింక్ ద్వారా తెలుసుకొనగలరు.

**ఋణగ్రహీత :** మెస్సర్స్ ట్రోపికల్ కోటింగ్స్ ఇంటర్ నేషనల్ ప్రై. లి., ప్లాట్ నెం.డి-1, బి-బ్లాక్, ఆటోనగర్, విశాఖపట్నం-530012. **డైరెక్టర్ / హామీదారు : 1)** శ్రీ మాగంటి రవీంద్రనాథ్, తండ్రి. శ్రీ ఉమా మహేశ్వర రావు, ఎమ్.ఐ.జి-228, సాయి పూజ ఎన్‌క్లేవ్, ఫ్లాట్ నెం.201, మాధవధార, వుడా కాలనీ, విశాఖపట్నం-530018. **డైరెక్టర్ / హామీదారు : 2)** శ్రీ ఎమ్.వి.ఎస్. జనార్దన రావు, ఎఫ్-4, శ్రావణి ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ థియేటర్ లేన్, కూర్మన్నపాలెం, గాజువాక, విశాఖపట్నం-530046. **హామీదారు :** శ్రీమతి మాగంటి శ్యామలత, భర్త. శ్రీ మాగంటి రవీంద్రనాథ్, ఎమ్.ఐ.జి-228, సాయి పూజ ఎన్‌క్లేవ్, ఫ్లాట్ నెం.201, మాధవధార, వుడా కాలనీ, విశాఖపట్నం-530018.

మొత్తం బకాయి రూ.11,80,44,325.89 పై (అక్షరాల పదకొండు కోట్ల ఎనభై లక్షల నలభై నాలుగు వేల మూడు వందల ఇరవై ఐదు రూపాయల ఎనభై తొమ్మిది పైసలు మాత్రమే) తేది.05.09.2018 నాటి వరకు + ఈ నోటీసు ప్రచురణ తేది వరకు వడ్డీ & ఛార్జీలు మరియు ఏదేని చెల్లింపులు చేసియున్నచో మినహాయించబడును.

ఈ ఋణగ్రహీత యొక్క బకాయిలు చెల్లింపు నందు విఫలమగుటచే బ్యాంకు నందలి వారి ఋణ ఖాతాలు తేది.20.07.2017 న ఎన్.పి.ఎ గా మార్పు చెందబడినది. కావున ఇప్పుడు బ్యాంక్ వారిచే రిజర్వు ధరగా నిర్ణయించబడిన రూ.47,78,185/- (అక్షరాల నలభై ఏడు లక్షల డెబ్బై ఎనిమిది వేల నూట ఎనభై ఐదు రూపాయలు మాత్రమే) కొరకు బయ్యవరం గ్రామం సైటు వద్ద ఉన్న ఈ దిగువ చెప్పబడిన మిషనరీ / సంబంధిత వస్తువులు యొక్క జాబితా విక్రయం చేయుటకు నిర్ణయించినారు.

చరాస్తులు యొక్క వివరములు ఈ దిగువ చెప్పబడినవి (ప్లాంటు & మిషనరీ)

వ్యాపారము యొక్క స్వభావము : వాటర్ ప్రూఫ్ పొరలు తయారీ

| క్ర.స | వివరములు |
|---|---|
| 1. | బ్లోన్ బిటుమన్ & ఎల్లాయిడ్ ప్లాంటు ఉత్పత్తి |
| 2. | వాటర్ ప్రూఫింగ్ ఫెల్ట్ లైపు ప్లాంటు ఎక్విప్‌మెంట్ |
| 3. | "ఎపిపి & ఎస్‌బిఎస్" మార్పు చేయబడిన వాటర్ ప్రూఫింగ్ పొరలు యొక్క తయారి పూర్తిగా గల ప్లాంటు, బిటుమన్ వాటర్ ప్రూఫింగ్ పొరలు తయారీ (డిప్ కోటింగ్ విధానము ద్వారా) |
| 4. | న్యూమాటిక్ కన్వేయర్ విధానము, విసిఎస్ తయారీ ఫీడ్ హోపర్ & బాగ్ ఫిల్లర్లు |
| 5. | కూలింగ్ టవరు |
| 6. | థర్మిక్ ఫ్లూయిడ్ హీటరు |
| 7. | ఎయిర్ కంప్రెసర్ మరియు పంప్ |
| ఎ. | కె 55 రోటరీ వేన్ వైపు ఎయిర్ కంప్రెసర్ సామర్థ్యం 800 సియు మీ/గంటకు 980 ఆర్.పి.ఎమ్, ప్రెషరు – 15 పి.ఎస్.ఐ హెచ్.పి–30 తో కలిగి ఉన్న ఒక బాక్సు అనుబంధ సామానులు. |
| బి. | 3"*3" హెవీ డీటినై గేర్ పంపుతో గల బాహ్య సామర్థ్యము – 250 ఆర్.పి.ఎమ్ హెడ్ వద్ద – 50 మీటరు హెచ్.పి–7.5 |
| 8. | 1) డిజిటల్ పెనెట్రో మీటరు 2) ఎ.బి.ఇ.ఎల్ ఫ్లాష్ సామానులు 3) థెర్మో మీటరు 4) ఫోర్డ్ కప్పు 5) రౌండ్ బాటమ్ ఫ్లాస్క్ 6) సాఫ్టెనింగ్ పాయింట్ అప్పారటస్ 7) మఫిల్ ఫర్నేస్ 8) హాట్ ఎయిర్ ఓవెన్ 9) హాఫిల్ ఫర్నేస్ 10) ఎస్పి గ్రావిటీ బాటిల్ 11) హైడ్రో మీటరు 12) టెస్ట్ సీవిస్ గ్లాస్ (ఫ్రేమ్ 13) పి.హెచ్ పేపర్ 14) సీవ్ షేకింగ్ మిషన్ 15) ఫోర్డ్ కప్ |
| 9. | ఎమ్ & ఎమ్ 75 కెవిఎ 3 పిహెచ్ ఎన్‌సిపి డిజి-సిపిసి-బి2 |
| 10. | ఎమ్ & ఎమ్ 5 కెవిఎ జనరేటర్ |
| 11. | ట్రాన్స్‌ఫార్మర్-200 కెవిఎ |
| 12. | కేబుల్స్, ఎమ్‌సిసి పానెల్స్ & స్విచ్‌లు |

**ధరావత్తు :** రూ.4,77,819/- (అక్షరాల నాలుగు లక్షల డెబ్బై ఏడు వేల ఎనిమిది వందల పంతొమ్మిది రూపాయలు మాత్రమే)
**బిడ్ పెంపుదల మొత్తము :** రూ.1,00,000/- (అక్షరాల ఒక లక్ష రూపాయలు మాత్రమే)

చరాస్తులు తనిఖీ చేసుకొనుట కొరకు తేది & సమయం : తేది.04.01.2024 ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల లోపు.

ధరావత్తు సమర్పించుటకు ఆఖరు తేది : 16.01.2024 సాయంత్రం 4.00 గం॥ల లోపు.

తదుపరి వివరముల కొరకు సంప్రదించుటకు : బ్రాంచ్ మేనేజర్, శ్రీ ఎమ్. వినోద్, ఫోన్ నెం.63049 06603

1) హెచ్1 బిడ్డరు తమ బిడ్ మొత్తము (నుండి తమ ధరావత్తు మొత్తము మినహాయించుకొని) RTGS/NEFT/నగదు బదిలీ పద్ధతుల ద్వారా ఖాతా సంఖ్య 3791817145 మరియు ఖాతా పేరు : "ఆర్.ఓ : విశాఖపట్నం ఇ-ఆక్షన్" నందు జమచేయవలెను. లబ్ధిదారుని పేరు : సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం, IFSC code: CBIN0280824 (IFSC code నందలి 5వ అక్షరము "జీరో").
2) ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం తేదికి తగినంత ముందుగా తమ పూర్తి వివరములు సర్వీస్ ప్రొవైడర్ https://www.mstcecommerce.com/auctionhome/ibapi నందు నమోదు చేసికొని, యూజర్ ఐ.డి మరియు పాస్‌వర్డ్ పొందవలెను. ఇ-వేలం నందు పాల్గొను ఆసక్తి గల బిడ్డర్లు వారి పాస్‌వర్డ్ మాత్రమే మార్చు చేసికొనవలసినదిగా సలహా ఇవ్వడమైనది. విక్రయం యొక్క పూర్తి నియమములు మరియు నిబంధనల కొరకు మా బ్యాంక్ యొక్క వెబ్‌సైట్ : www.centralbankofindia.co.in నందు ఇవ్వబడిన లింక్‌ను చూడండి మరియు https://www.ibapi.in ను దర్శించండి.
3) బిడ్డర్లు వెబ్‌సైట్ : https://www.mstcecommerce.com/auctionhome/ibapi నందు వివరములు నమోదు చేసిన వారి KYC పత్రములు దయచేసి అప్‌లోడ్ చేయగలరు. మా సర్వీసు ప్రొవైడరుచే KYC పత్రములు నిర్ధారణ చేయబడిన తరువాత ధరావత్తు మొత్తము గ్లోబల్ ఇ.ఎమ్.డి. వాలెట్ నందు NEFT/బదిలీ https://www.mstcecommerce.com/auctionhome/ibapi వారి నుండి చలాన పొందబడిన తరువాత జమ చేయవలెను.
4) చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు. ఇందుమూలముగా ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు యొక్క సెక్యూర్డ్ చరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్స్ వారి యొక్క బకాయి మొత్తములను తిరిగి వసూలు చేసికొనుటకు అమ్మకం చేయగలరని ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

* గమనిక : విజేత బిడ్డరుచే ఈ షెడ్యూలు నందు చరాస్తి సైటు వద్ద నుండి తొలగించుట & బదిలీ చేయుటకు అగు ఖర్చులు భరించవలసి ఉన్నది మరియు నియమములు & నిబంధనలు అనుసారం పూర్తి సొమ్ము చెల్లించిన 15 రోజులలోపుగా మాత్రమే బదిలీ చేయవలసియున్నదిగా గమనించవలెను.

తేది : 29.12.2023, ప్రదేశం : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా